క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ కమలాపూర్ సెక్షన్ ఏఈఈ రాములు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనిగరం ఫీడర్ (పెద్ద లైన్)లో చెట్ల తొలగింపు ఉన్నందున ఆ ఫీడర్ పరిధిలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న నేరెళ్ల, శనిగరం, గోపాల్‌పూర్, మాదన్నపేట, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కమిటీ ఎన్నిక

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం తెలంగాణ ధూపదీప నైవేద్య సంఘం ఆత్మకూరు, దామెర మండలాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఇందులో ఆత్మకూరు, దామెర మండలాల సంయుక్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలనుపాక వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా లేదాల్ల శ్రీనివాసులు, కొట్టురి సుధీర్‌కుమార్, కోశాధికారిగా ఆరుట్ల మాధవమూర్తిని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. తమ నియామకానికి సహకరించిన రెండు మండలాల ధూపదీప నైవేద్య అర్చకులకు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల మధుకర్‌శర్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి వచ్చునూరి రవీందర్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు, సిద్ధాంతి గణేశ్‌కుమార్, పరకాల డివిజన్ అధ్యక్షుడు కొలనుపాక భాస్కరశాస్త్రీ, రెండు మండలాల అర్చకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి



శాయంపేట : విద్యుత్ స్తంభం స్టే వైరుకు తగిలి 6 మేకలు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బండి రవి తన మేకలను గ్రామ శివారులో మేపుతుండగా బావి వద్ద గల విద్యుత్ స్తంభానికి ఉన్న స్టే వైరుకు ప్రమాదవశాత్తు తగిలి 6 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ యూత్ నాయకుడు సూర భాస్కర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మృతిచెందిన మేకల విలువ సుమారు రూ. 1లక్ష 20వేలు ఉంటుందని బాధితుడు రవి తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాకేశ్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ శ్రేణులు



హసన్‌పర్తి: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించినందుకు పార్టీ శ్రేణులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చిర్ర సుమన్, మహేందర్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ తోటకు చేరిన మృతదేహాలు

మాజీ ఎమ్మెల్యే సందర్శన

ఖిలా వరంగల్ : హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా రఘునాథపల్లి మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద టిఫిన్ తింటున్న వారిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందిన విషయం విధితమే.. నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్‌తోటకు చెందిన తెలకలపల్లి రవీందర్ కుటుంబం బతుకు దెరువు నిమిత్తం హైదరాబాద్ బీబీనగర్‌లో ఉంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు బీబీనగర్ నుంచి సోమవారం ఉదయాన్నే సొంతూరికి బైక్‌పై బయల్దేరారు. దారి మధ్యలో రఘునాథపల్లి సమీపంలోని రోడ్డు పక్కనున్న మొబైల్ టిఫిన్‌సెంటర్ వద్ద టిఫిన్ తింటుండగా ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలు, కుమారుడు దుర్మరణం చెందారు. మృతదేహాలకు పోస్టమార్టం పూర్తిచేసి ఎస్‌ఆర్‌ఆర్‌తోటలోని స్వగృహానికి పంపించారు. ఒకే కుటుంబలో ముగ్గురు దుర్మరణం చెందగా విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ, బీఆర్‌ఎస్‌నేత పల్లం రవితో కలిసి మాజీ ఎమ్మెల్యే నరేందర్ మంగళవారం మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అడుగుకోగుంత.. ప్రయాణానికి చింత

- ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- క్రషర్ల నుంచి అధిక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లు
- పట్టించుకోని అధికారులు ,ప్రజాప్రతినిధులు



పీచర నుంచి వేలేరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి



పీచర నుంచి వావిళ్లకుంటతండ వెళ్లే రోడ్డు



పీచర నుంచి శాలపల్లి వెళ్లే రోడ్డు

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాల బీటీ రోడ్లపై అడుగుకోగుంత దర్శనమిస్తుంది. మరమ్మతులు, విస్తరణకు నోచుకోక ఏళ్లు గడుస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఓవైపు కంకర తేలిన రోడ్లు, మరోవైపు గుంతల రోడ్లు, మలుపులతో రాత్రిపూట ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్‌కు గుంతలు కనిపించకపోవడం, వేగంగా వస్తూ గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచుకుంటున్నాయని వాపోతున్నారు.

దుమ్ము లేపుతున్న టిప్పర్లు

మండలంలో 14 గ్రామ పంచాయితీలు ఉండగా కేవలం మల్లికుదుర్ల, సోడాషపల్లి, వేలేరు గ్రామాల్లో గత ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మించింది. మిగతా గ్రామాల్లోని అడుగుకోగుంత దర్శనమిస్తుంది. కాగా మండలంలోని రెండు స్టోన్ క్రషర్‌ల వలన పెద్ద వాహనాలు, టిప్పర్లు అధిక లోడ్‌తో రవాణా కొనసాగిస్తుండడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. పీచర నుంచి శాలపల్లి మీదుగా వేలేరు మండల కేంద్రానికి వెళ్లే బీటీ రోడ్డును చూసి వాహనదారులు జంకుతున్నారు. పీచర నుంచి చిల్పూర్ మండలం మల్కాపూర్‌కు వెళ్లే బీటీ రోడ్డు కూడా గుంతలమయమై మారింది. పీచర నుంచి వావిళ్లకుంటతండకు వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసమైపోవడంతో క్రషర్ యాజమాన్యం రోడ్డుపై ఏర్పడిన గుంతలలో కంకర, డస్ట్ నింపి గుంతలను పూడ్చి వేస్తున్నారు. భారీ వాహనాలు నిత్యం తిరుగుతుండటంతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తుందని, అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



పీచర గ్రామం నుంచి వేలేరు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లాలంటే శాలపల్లి మీదుగా వెళ్తుంటాం. ఆ రోడ్డుపై భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతుండటంతో బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఆ గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన బీటీ రోడ్డు నిర్మించాలి.

– ఎండీ.హరీఫ్, పీచర

వేడుకగా హనుమాన్ హోమగుండ పూజలు

నర్సంపేట : పట్టణంలోని శాంతినగర్‌లో హనుమాన్ మాల ధరించిన భక్తులు మంగళవారం కుటుంబ సమేతంగా హోమగుండ పూజలు వేడుకగా నిర్వహించారు. పూజారి గూడ రామకృష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని హనుమాన్ మాల 41 రోజు దీక్షలో భాగంగా 28వ రోజును పురస్కరించుకొని పట్టణంలో తొలిసారిగా హనుమాన్ సువచ్చలాదేవి విగ్రహానికి పూజ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. గురుస్వామి వెంకన్న, అప్పాల శ్రీకాంత్, వానం భిక్షపతి, రాయపురం రాజు, పులిచేరి రమేశ్, రాయపురం ప్రవీణ్, పాలకుర్తి మధు, శ్రీరాముల రాజు, పల్లకొండ సాంబయ్య, గుర్రం పాషా, పాలకుర్తి రవి, మెరగుర్తి రమేశ్, రమావత్ నారాయణ, వేమునూరి సుధాకర్, పల్లకొండ సాంబరాజ్, అన్నంరాజు, నూనె స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ సరికాదు

విద్యారణ్యపురి: నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన భత్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసినట్లుగానే తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగగా వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్యని, తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, పూజారి మనోజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు నిర్వర్తించినందుకు రావాల్సిన భత్యంను అడిగితే ఉపాధ్యాయులపై పోలీసు బలగాలను ప్రయోగించడం అత్యంత దారుణమన్నారు. ఈ గొడవకు కారణమైన అధికారులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్ చేయడం సరికాదని తెలిపారు. చర్యలు తీసుకోని పక్షంలో త్వరలోనే ఆందోళనకు దిగనున్నట్లు ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఇక నుంచి వృత్తి విద్యా కోర్సులు

పర్వతగిరి : మండలంలోని కల్లెడ గ్రామంలో గల ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుత పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్యా కోర్సులు ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ ఎ.జనార్ధన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్‌ఎం (మహిళ), ఈటీ, సీఎస్‌సీ కోర్సులు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంఎల్‌టీ అభ్యసించిన వారు సొంతగా ల్యాబ్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి, ప్రభుత్వ, డెంటల్ కాలేజీల్లో, క్లినికల్ ల్యాబ్‌ల్లో ఉద్యోగం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కోతల వేళ వర్షాఘాతం

రైతన్నకు భారీ నష్టం

- అధికారుల మాటలు బేఖాతరు
- తడిసిన ధాన్యాన్ని కొనని మిల్లర్లు



వర్షానికి నేలవాలిన వరిపంట



తడిసిన ధాన్యాన్ని కుప్ప చేసుకుంటున్న రైతులు



వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

ఖానాపురం : పంటల కోతల వేళ రైతన్నపై వర్షాఘాతం తప్పడంలేదు. ఈనెల 12 నుంచి మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు మండలవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని ఖానాపురం, బుధరావుపేట, మనుబోతులగడ్డ, అశోక్‌నగర్, అయోధ్యనగర్, దబ్బీరుపేట, చిలుకమ్మతండా, ధర్మరావుపేట, కొత్తూరు, రంగాపురం, తదితర గ్రామాలకు చెందిన రైతులు పాకాల ఆయకట్టు కింద సుమారు 18 వేల ఎకరాల్లో యాసంగి వరి పంట సాగు చేశారు. మండలంలో సుమారు 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఖానాపురం, బుధరావుపేట, కొత్తూరు, రంగాపురం, మనుబోతులగడ్డ, అశోక్‌నగర్, అయోధ్యనగర్, దబ్బీరుపేట, ఐనపల్లి, తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. ప్రస్తుతం సగానికి పైగా కోతలు పూర్తి అయ్యాయి. ఇంకా కొంత మేర పంటలు ఆయకట్టులో కోత దశలో ఉన్నాయి. కోతలు పూర్తి చేసుకున్న రైతులు రోడ్లపైనా, సబ్ మార్కెట్ యార్డులో, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు అన్నదాతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. మంగళవారం సాయంత్రం కూడా వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యాన్ని రాసులుగా నేర్పుకునేందుకు అష్టకష్టాలు పడ్డ దుస్థితి కళ్లకు కడుతోంది. ఎంత కష్టపడినా చాలా వరకు ధాన్యం తడిసిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్న పరిస్థితి కనపడుతోంది.

తడిసిన ధాన్యం కోసం మిల్లర్లను బతిమిలాడాల్సిన దుస్థితి

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటించినా మిల్లర్లను రైతులు బతిమిలాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు రైతుల ధాన్యాన్ని తిరస్కరిస్తున్నారు. కొనుగోలు చేసేది లేదని ఖరాఖండిగా చెబుతుండడంతో రైతన్న చేసేదేమీ లేక ఎంతో కొంత ధర చెల్లించి కొనుగోలు చేయండి మహాప్రభో.. అంటూ బతిమిలాడుకుంటున్న పరిస్థితి చోటు చేసుకుంటోంది.

తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందే..

ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ప్రకటించిన క్రమంలో రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాల్సిందేనని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు. మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా అధికారుల మాటను బేఖాతరు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటలు నష్టపోయిన వేదనలో రైతన్నలు కొట్టుమిట్టాడుతుండగా మిల్లర్లు తడిసిన ధాన్యాన్ని కొనేది లేదని తేల్చి చెబుతుండడంతో రైతులకు కన్నీరు తప్పడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖలు సత్వరమే స్పందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

డీటీడీఓ అక్రమాలపై విచారణ చేపట్టాలి

రాయపర్తి : జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీఓ) ప్రేమకళ అక్రమాలపై విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ, జనగాం జిల్లాలకు అధికారిగా వచ్చినప్పటి నుంచి ప్రేమకళ మూడేళ్లుగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నుంచి మధ్యవర్తుల ద్వారా లక్షలాది రూపాయలు దండుకుంటూ లోపాయికారిగా ఒప్పందం చేసుకుని అదనంగా మరో హాస్టల్ అప్పగిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జనగాం జిల్లాలో పలువురికి రెండు చొప్పున హాస్టళ్లు అప్పగించారని తెలిపారు. అలాగే హాస్టళ్లలో ప్రతీ నెల డైట్ బిల్లుల నుంచి 20 శాతం లంచం తీసుకుంటూ విద్యార్థుల హాజరును అక్రమంగా 100 శాతం నమోదు చేయిస్తున్నట్లు ఆరోపించారు. డీటీడీఓ ప్రేమకళ గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టుపట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే డీటీడీఓ అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఖానాపురం : ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. ఐనపల్లిలో హరితమిత్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,203, కామన్ రకాలకు రూ.2,183 చొప్పున కొనుగోలు చేస్తారని తెలిపారు. ధాన్యం కొనుగోలు తర్వాత సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం తరుపున ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) స్వప్న, పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, మేరుగు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో 76.86 శాతం పోలింగ్

- అత్యధికంగా దామెర, అత్యల్పంగా పరకాల



ఓటు వేసేందుకు బాలికల ఉన్నత పాఠశాలలో బారులుదీరిన మహిళలు (ఫైల్)

పరకాల : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో 76.86 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మంగళవారం వెల్లడించారు. మొత్తం 2,22,383 మందికి 1,70,916 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. వీరిలో అత్యధికంగా మహిళలు 86,387 మంది ఓటు వేయగా పురుషులు 84,528 మంది, ఇద్దరు ఇతరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దామెర మండలంలో 21,684 మంది ఓటర్లకు అత్యధికంగా 17,0800 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 82.02 శాతం నమోదు అయినట్లు తెలిపారు. పరకాల పట్టణంలో 26,490 మంది ఓటర్లకు అత్యల్పంగా 17,836 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 67.33 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. పరకాల మండలం 14,949 మంది ఓటర్లు (10 గ్రామాలు)లో 11,544 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 77.22 శాతం నమోదు అయినట్లు తెలిపారు. వరంగల్ 15వ డివిజన్‌లో 11,185 మంది ఓటర్లకు 8,116 మంది ఓటు వేయగా 72.56శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. అలాగే 16వ డివిజన్‌లో 11,519 మంది ఓటర్లకు 8, 378 మంది ఓటు వేయగా 72.73శాతం, 17వ డివిజన్‌లో 10,012 మంది ఓటర్లకు 7,607 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆత్మకూరులో 28,413 మంది ఓటర్లకు 22,397 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 78.83శాతం, సంగెంలో 41,249 మంది ఓటర్లకు 33,316 మంది ఓట్లు వేయగా 80.77 శాతం, గీసుకొండలో 28,358 మంది ఓటర్లకు 21,939 మంది ఓట్లు వేయగా 77.52 శాతం, నడికూడలో 28,524 మంది ఓటర్లకు 21,939 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 76.91శాతం పోలింగ్ నమోదు అయినట్లు పరకాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కమలాపూర్ : రక్తదానం చేస్తున్న యువకులు

కమలాపూర్ : రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ నరేష్ పిలుపునిచ్చారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగరాజుతో పాటు 12 మంది రక్తదానం చేశారు. పరకాల బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు వారి నుంచి రక్తం సేకరించారు. అనంతరం డాక్టర్ నరేష్ మాట్లాడుతూ.. నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు అత్యవసర సమయంలో రక్తం అందకపోవడంతో మృతి చెందుతున్నారన్నారు. అలాంటి వారి కోసం రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. పరకాల బ్లడ్‌బ్యాంక్ వైద్యాధికారి వరుణ్, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న వేణుగోపాల్

ఖిలా వరంగల్ : అర్ధరాత్రి పోలీస్, ప్రెస్ అంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు కమటం వేణుగోపాల్ కోరారు. అర్ధరాత్రి రహదారిపై కారు పార్క్ చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై వేణుగోపాల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంటకు సాకరాశికుంట మహారాజుల కాలనీలో పోలీస్ సైరన్ వేస్తూ అనుమానాస్పదంగా ఉన్న ఒక ప్రైవేటు వాహనం (టీఎస్03ఈక్యూ3816) నంబర్ గల కారు కనిపించింది. రహదారిపై చేస్తున్న హల్‌చల్‌ను సెల్‌ఫోన్‌లో చిత్రకరించే ప్రయత్నం చేస్తుండగా ఆ వాహనంలో ఉన్న నలుగురు ఒకరు పోలీస్ డిపార్ట్‌మెంట్ అని, మరొకరు ప్రెస్ అంటూ నాపై దాడికి దిగి సెల్ ఫోన్ లాక్కున్నారని తెలిపాడు. తాను జర్నలిస్టు ఐడీ కార్డు చూపాలని ప్రశ్నించగా దౌర్జన్యానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్థానికులు రోడ్డుపైకి రావడంతో సెల్‌ఫోన్ విసిరేసి కారులో పారిపోయారని, వారు వాడే కారుపై కార్పొరేటర్ అని లేబుల్ స్టిక్కర్ ఉందని తెలిపారు. రాత్రి తనపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని మంగళవారం మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో వామపక్షాల మద్దతుతో పోటీచేసిన ఇండియా కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యవాదులకు, మతోన్మాదులకు మధ్య జరిగిన ఎన్నికలు అన్నారు. మతం, కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూసేవారికి ఈ ఎన్నికలు ఒక గుణపాఠంగా మారనున్నాయని తెలిపారు. సమావేశంలో నాయకులు కర్రె భిక్షపతి, కరుణాకర్, ఆదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, ఎల్లేశ్, వేల్పుల సారంగపాణి, ఏ.శ్రీనివాస్, సంతోష్, సదానందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు సన్మానం



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హిస్టరీ అండ్ మాస్టర్ ఆఫ్ టూరిజం విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌ను కేయూ అధ్యాపకుల సంఘం సన్మానించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు శాలువా కప్పి మొక్కను అందజేశారు. కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.నాగయ్య, బాధ్యులు గడ్డం కృష్ణ, మధుకర్‌రావు, మధుశ్రీ, బ్రహ్మయ్య, కుమార్,బి శ్రీధర్ వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.